గంగపుత్రులను ఎంబీసీలో చేర్చాలి

బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజేశ్ ఖన్నా

ఖైరతాబాద్, నవంబర్ 12 : సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, అన్ని రంగాల్లో వెనుకబడిపోయిన గంగపుత్రులను ఎంబీసీ జాబితాలో చేర్చాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టంగుటూరి రాజేశ్ ఖన్నా కోరారు. మంగళవారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని గంగపుత్రులు సంప్రదాయ మత్స్యకారులుగా జీవితాలు సాగిస్తున్నారని, కేవలం చేపల వేట ద్వారానే జీవనోపాధి పొందుతున్నారన్నారు. తక్షణమే వారిని ఎంబీసీ జాబితాలో చేర్చాలని, ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

దళిత సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

బండ్లగూడ,నవంబర్ 12 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బండ్లగూడ జాగీర్ గ్రామ దళిత సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా గుండడ నగేష్,ప్రధాన కార్యదర్శిగా బంగారి పెంటయ్య,ఉపాధక్షులు కాంతారావు,అమూల్ రాజ్,కోశాధికారిగా గంగని రాజు, ప్రచార కార్యదర్శిగా మహేందర్,సభ్యులుగా గంగని అర్జున్, గంగపాక దేవేందర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను మాజీ సర్పంచ్ గంగని హరికృష్ణ సన్మానించారు.

డిసెంబర్‌లో 22న జరిగే మహాసభలకు సిద్ధం కావాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నిర్మాణ మహాసభలు డిసెంబర్ 22న హిమాయత్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేం పావని తెలిపారు.మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికుల హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు చేశామన్నారు.రాష్ట్ర నిర్మాణ మహాసభల కంటే ముందే అన్ని జిల్లాల్లో నిర్మాణ మహాసభలను నిర్వహించాలని కార్మికులకు పిలుపు నిచ్చారు.

నామినేటెడ్ పదవుల్లో...ఆశలు గల్లంతు

పార్టీ జెండామోసినోళ్లకి మొండి చెయ్యి

పార్టీ మారినోళ్లకు పదవుల పందేరం



- నామినేటెడ్ పదవుల్లో...ఊహించని పేర్లు
- ఎమ్మెల్యే తీరుపై పాత కాంగ్రెస్ నేతల తిరుగుబాటు
- రాజేంద్రనగర్ నియోజకవర్గంలో
- ఆగమాగంగా 'కాంగ్రెస్ పార్టీ' శ్రేణుల పరిస్థితి

మణికొండ, నవంబర్ 12 : దశాబ్దకాలం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి మంచిరోజుచ్చాయని అంతా అనుకున్నారు. ఇక తమ సర్కారు వచ్చింది మంచి నామినేటెడ్ పదవులు తమకే దక్కుతాయన్న కొండంత విశ్వాసంతో ఆ పార్టీ శ్రేణులు ఆశలు పెంచుకున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు అప్పుడే ప్రయత్నాలు కూడా మొదలు పెట్టి తమ అర్జీలను సంబంధిత శాఖల మంత్రుల వద్ద విన్నపాలు విన్నవించుకున్నారు. సీఎం ఆశీస్సులతో పాత కాంగ్రెస్ పార్టీలో ఉన్న సీనియర్లకే నామినేటెడ్ పదవుల్లో స్థానం దక్కుతుందనుకున్న నేతలకు ఊహించని షాక్ తగిలింది. పదేళ్ల పాటు పార్టీ జెండా పట్టుకుని ప్రతిపక్షంలో ఉండి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన తర్వాత ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, తన అనుచరులతో కలిసి మూడు మాసాల క్రితం కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అయ్యారు. షరతులతోనే తాను పార్టీ మారానని, తన అనుచరులకు తాను కోరిన పదవులు ఇస్తేనే వస్తానని సీఎం రేవంత్‌ను ఒప్పించి కండువా మార్చినట్లు ఎమ్మెల్యే బహిరంగంగానే చెప్పుకున్నాడు. ఇటీవల పార్టీ మారి వచ్చినోళ్లకు నామినేటెడ్ పదవులను కట్టబెట్టడంతో పాత కాంగ్రెస్ నేతలు భగ్గుమంటూ పార్టీ పెద్దల తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు.

■ నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ కమిటీని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సోమవారం అధికారికంగా పన్నెండు మందితో పాలకవర్గ ఉత్తర్వులను ప్రకటించారు. నామినేటెడ్ పదవుల ప్రకటన వెలువడిన గంటల్లోనే రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా పాత కాంగ్రెస్ నేతలంతా ఒక్కసారి భగ్గుమన్నారు. నిన్న మొన్న పార్టీ మారినోళ్లకు పదవులు కట్టబెట్టి..ఇన్నాళ్లు పార్టీ జెండా మోసినోళ్లకు అధిష్టానం మొండిచెయ్యి చూపిందంటూ సోషల్‌మీడియాలో దుమ్మెత్తిపోస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీకి నాలుగు డైరెక్టర్ పదవులను కట్టబెట్టగా ముగ్గురు ఇటీవల పార్టీ మారి కనీసం కండువా కూడా కప్పుకోని వారికి డైరెక్టర్ పదవులను కట్టబెట్టారంటూ పాత నేతలు మండిపడుతున్నారు.

■ అదేవిధంగా కోకాపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి, పీరంచెరువు, గౌలిదొడ్డి గ్రామాలల్లో కొత్త వారికే పదవులు దక్కాయి. దీంతో ఇన్నాళ్లు అధికార పార్టీలో ఉంటూ తమను పరోక్షంగా వేధించిన వాళ్లకే తిరిగి పదవులు కట్టబెట్టడమేమిటని పాత నేతలు ప్రశ్నిస్తున్నారు.

నేడో రేపో..మరో ప్రకటన..!

రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ కమిటీని నేడో రేపో ప్రభుత్వం ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్లు వార్తలు విన్పిస్తున్నాయి. అయితే రెండు జిల్లాల పరిధిలోని నేతలకు ఈ పాలకవర్గంలో చోటు కల్పించాలంటూ గత రెండు నెలలుగా తీవ్రమైన చర్చలు, సమావేశాలు జరుగుతున్నాయి. చేవెళ్ల, రాజేంద్రనగర్, కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల పరిధి నుంచి కాంగ్రెస్ పార్టీ నేతలకు ఈ పాలకవర్గంలో చోటు కల్పించాల్సి ఉంటుంది. కానీ పెద్ద నాయకుల సమన్వయ లోపం కారణంగా ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జీలు తమ అనుచరులకే కట్టబెట్టాలంటూ అధిష్టానంపై వత్తిడి తీసుకురావడంతో ఎప్పుడో రావాల్సిన ప్రకటన కాస్త రేపో మాపో అన్నట్లుగా తయారైయింది. అయితే ఈ పాలకవర్గం చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు మొత్తం 14మంది సభ్యులుండాలి, కానీ మొత్తం 26 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. వీరిలో పాత కాంగ్రెస్ నేతలకే అవకాశం కల్పించాలంటూ కొందరు అధిష్టానం వద్ద ఒత్తిడి తీసుకువస్తుండగా, తమ అనుచరులకే ప్రాధాన్యత కల్పించాలంటూ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పట్టుబట్టినట్లు తెలిసింది. దీంతో ఈ పాలకవర్గ ఉత్తర్వుల ప్రకటన వస్తే మరోసారి నాలుగు నియోజకవర్గాల్లో అసమ్మతి వాదం తెరలేవడం ఖాయమంటూ కాంగ్రెస్ శ్రేణులు అంటున్నారు.

గౌరవం లేనిచోట పనిచేయడం అవసరమా..!

దశాబ్దకాలంగా పార్టీ జెండా మోసిన తమకు కనీసం నామినేటెడ్ పదవుల్లోనూ గౌరవం దక్కకపోవడంతో ఆశావహులైన ద్వితీయశ్రేణి నేతలు ఈ పార్టీకి పనిచేయడం అవసరమా అంటూ మండిపడుతున్నారు. నిన్నా మొన్నటి వరకు ఇతర పార్టీకి పనిచేసిన వారికి పదవులను కట్టబెట్టడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇన్నాళ్లు పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడిన తమను కొంతమంది నేతలు కావాలనే అవమానపర్చుతున్నారంటూ మండిపడుతున్నారు.

వైద్య ఖర్చుల కోసం ఎల్ వోసీ అందజేత

బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, నవంబర్ 12 : ప్రజలందరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు.బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఐదో డివిజన్ సాయిహర్ష కాలనీకి చెందిన జ్యోతి ఇటీవల కిడ్నీ మార్పు చేసుకున్నది. ఆమె ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో స్థానిక కార్పొరేటర్ శ్రీనాథ్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో సీఎం సహాయ నిధికి దరఖాస్తు పెట్టు కున్నది. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రెండు లక్షల 50వేల ఎల్‌వోసీని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మంగళవారం బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు పూలపల్లి కృష్ణరెడ్డి,రాంప్రసాద్, శ్రీనివాస్,ప్రేమ్‌కుమార్, శ్రీను ముదిరాజ్,విష్ణు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

యూసుఫ్‌గూడలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అబ్జర్వర్ అధికారి మయాంక్ మిట్టల్

జూబ్లీహిల్స్,నవంబర్ 12: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎస్‌పీఈఈఈఈసీ పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి మయాంక్ మిట్టల్ ఆదేశించారు. మంగళవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణానగర్, లక్ష్మీనరసింహ నగర్‌లలో యూసీడీ రిసోర్స్ పర్సన్‌లు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు సర్వే చేపడుతున్న విధానాన్ని, సర్వే సిబ్బంది దరఖాస్తులు నింపుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా, జోనల్ నోడల్ ఆఫీసర్ యూబీడీ డీడీ అనిల్ కుమార్, సర్కిల్ నోడల్ ఆఫీసర్.. డీపీఓ వెంకటకిషన్ రావు, ఏఎంసీ కమల్, ఏఎంఓహెచ్ డాక్టర్ సాల్మన్, ఎస్ఎస్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే, డేటా ఎంట్రీ సెంటర్ పరిశీలన

సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తులను కంప్యూటరీకరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు అమీర్‌పేట్ మైత్రీ విహార్‌లోని డేటా ఎంట్రీ సెంటర్‌ను ఎస్‌పీఈఈఈఈసీ అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి మయాంక్ మిట్టల్ సందర్శించారు. డేటా ఎంట్రీ సెంటర్‌లో వసతులను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు.

పబ్లిక్ ప్లేస్‌లో...ట్రాన్స్‌ఫార్మర్

స్పందించిన అధికారులు

మణికొండ, నవంబర్ 12 : 'పబ్లిక్‌ప్లేస్‌లో..ప్రైవేట్ ట్రాన్స్‌ఫార్మర్' పేరిట మంగళవారం నమస్తే తెలంగాణలో ప్రచరితమైన శీర్షికపై విద్యుత్‌శాఖ డీఈ రమేశ్‌చంద్ర స్పందించారు. ఈ మేరకు ఆయన సిబ్బందితో కలిసి మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడలోని తిరుమలహిల్స్ కాలనీలో పబ్లిక్ ప్లేస్ ప్రైవేటు వ్యక్తికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును ఆయన పరిశీలించారు. సదరు వ్యక్తిని పిలిపించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలుపగా ఆయన తానే వారం రోజుల్లో తీసివేస్తానని అధికారులకు హామీ ఇచ్చారని డీఈ రమేశ్‌చంద్ర తెలిపారు.

విప్రో టాలెంట్ నెక్స్ ్ట సర్టిఫికెట్లు ప్రదానం

సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

బంజారాహిల్స్,నవంబర్ 12: బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో విప్రో టాలెంట్ నెక్స్ ్ట కార్యక్రమంలో భాగంగా 150 గంటల జావా కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విప్రో టెక్నాలజీస్ సంస్థ దేశంలో 150 కళాశాలల విద్యార్థులకు ఈ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నదని, తమ కళాశాల నుంచి 77మంది విద్యార్థులు కోర్సు పూర్తిచేసి సర్టిఫికెట్లు పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఫారూఖ్ బాషా, ప్రో.సయ్యద్ షబ్బీర్ అహ్మద్, ఆయేషా నాజ్, అస్రార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ వన్‌టైం చాన్స్ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ వన్‌టైం చాన్స్ సప్లమెంటరీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు.

తొలగించిన ఆర్టీసీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

ఖైరతాబాద్, నవంబర్ 12 : విధుల్లో నుంచి వివిధ కారణాలతో తొలగించిన ఆర్టీసీ కార్మికులను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ కార్మికుడు రాజేందర్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో గడిచిన కొన్ని నెలల్లో డ్రైవర్, కండక్టర్, క్లర్క్, సెక్యూరిటీ సిబ్బందిని చిన్న చిన్న కారణాలతో తొలగించారని, దీంతో వారు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బాగేశ్వర్, గంగాధర్, ప్రసాద్, రాంచందర్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో జాతీయ స్థాయికి క్రీడాకారుల ఎంపిక

మార్షల్ ఆర్ట్స్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్సై సుదర్శన్‌యాదవ్

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 12: విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని ఎస్సై సుదర్శన్‌యాదవ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లికి చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం అకాడమీలో జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 9,10 తేదీల్లో హస్తినాపూర్‌లోని శ్రీ భవిష్య స్కూల్‌లో 2వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ విష్యూ చాంపియన్‌షిప్-2024 పోటీలు జరిగాయి. ఇందులో జి.దేవాన్ష్ యాదవ్ 21 కేజీల విభాగంలో బంగారు పతకం, జి.నైటీష్, పి.ప్రణవ్‌లు పతకాలు సాధించారన్నారు. పంజాబ్‌లో జరిగే నేషనల్‌కు వీరు ఎంపికైనట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభకనబరిచి మరిన్ని పతకాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహవీర్ విష్యు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

బాలాజీ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 12: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బాలాజీ కాలనీలో అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎక్కడ కూడా నాణ్యతా లోపాలు లేకుండా పనులు చేపట్టాలన్నారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తేవాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు జరుగుతున్న పనులను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ అడికే జనార్దన్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహ మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, హరీష్, తలారి చిన్న తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు అందరూ సహకరించాలి

తమ కుటుంబ వివరాలను సర్వే సిబ్బందికి అందజేస్తున్న జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్/శంషాబాద్ రూరల్/మైలార్‌దేవ్‌పల్లి / మణికొండ, నవంబర్ 12: సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే సిబ్బందితో సహకరించాలని, సంపూర్ణమైన సమాచారాన్ని అందించాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. కుటుంబ సర్వేలో భాగంగా మంగళవారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని మేయర్ ఇంటికి ఎన్యూమరేటర్లు వచ్చి వివరాలు సేకరించారు. మేయర్ స్వయంగా దరఖాస్తు నింపి వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ 18 డీఎంసీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ మున్సిపాలిటీలో ..

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి సూచించారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని ఘాన్సిమియాగూడలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను కమిషనర్ సుమన్‌రావుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్యగౌడ్,మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను వేగవంతం చేయాలి

సమగ్ర సర్వేను వేగవంతం చేసి పూర్తి స్థాయిలో ఇంటింటికెళ్లి వివరాలను నమోదు చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ సూచించారు. మైలార్‌దేవ్‌పల్లిలోని కేన్ ప్రోత్ అపార్ట్‌మెంట్స్‌లో జరుగుతున్న ఇంటింటి సమగ్ర సర్వే వివరాలను ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లతో సమావేశమై వారికి పలు సూచనలు, సహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సమగ్ర సర్వేకు ప్రజలంతా సహకరించాలని మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులోని మహల్ నెక్నాపూర్, 9వ వార్డులోని సాయిరామ్ రెసిడెన్సీ, సైబర్ ఈ పార్క్, శ్రీరామ్ స్వాతి అపార్ట్‌మెంట్, 10వ వార్డులోని గ్రీన్ స్పేస్ ప్రైడ్ అపార్ట్‌మెంట్, 11వ వార్డులోని మై హోమ్ అవతార్‌లోని 8,9, బ్లాక్‌లలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్, ఏఈఈ సంజయ్ తదితరులున్నారు.

శంషాబాద్ మున్సిపాలిటీ ఘాన్సిమియాగూడలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, తదితరులు

మైలార్‌దేవ్‌పల్లిలోని ఎన్‌ప్రోత్ అపార్ట్‌మెంట్‌లో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న ఉపకమిషనర్ రవికుమార్

ప్రజలకు సేవలందించాలి

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న నార్సింగి వ్యవసాయ మార్కెట్ నూతన చైర్మన్ కోట వేణుకుమార్‌గౌడ్, పాలకవర్గ సభ్యులు

మణికొండ, నవంబర్ 12: ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులంతా నిరంతరం కృషిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన కోట వేణుకుమార్ గౌడ్, వైస్ చైర్మన్ దశరథ యాదవ్‌ల ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.నార్సింగి వ్యవసాయ మార్కెట్ యార్డులో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దశరథ్‌యాదవ్, డైరెక్టర్లు లక్ష్మీశ్రీ, బాల్‌రెడ్డి, కుమార్, గణేష్, మల్లేష్, రాజు, ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఈఎన్‌టీ, కంటి పరీక్షలు చేయించుకున్న విద్యార్థులతో వైద్య నిపుణులు, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రతినిధులు

జూబ్లీహిల్స్,నవంబర్12: విద్యార్థులకు దృష్టి, వినికిడి సమస్యలుంటే చదువులో వెనుకబడతారని.. ఆయా సమస్యలు లేకుండా పేద పిల్లలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాల కోటిరెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం మండలం కోళ్ళపడకల్‌లోని జడ్పీ హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో సమగ్ర ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. 'పుష్పగిరి విట్రియో రెటినా ఇనిస్టిట్యూట్'.. 'మా ఈఎన్‌టీ హాస్పటల్' సౌజన్యంతో విద్యార్థులకు ఉచిత నేత్ర, ఈఎన్‌టీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు దృష్టి, వినికిడి తదితర పరీక్షలు నిర్వహించి 150 మంది నుంచి స్క్రీనింగ్‌లను స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ రొటేరియన్లు డీజీఈ రామ్ ప్రసాద్, పెంచల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరో వార్డులో సీసీ రోడ్డు పనులు పరిశీలన

మణికొండ, నవంబర్ 12 : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా నిరంతరం ప్రజల్లో ఉంటూ కృషిచేస్తున్నానని నార్సింగి మున్సిపాలిటీ ఆరవ వార్డు కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు అన్నారు. రూ.20లక్షల మున్సిపాలిటీ సాధారణ నిధులతో ఆరవ వార్డులో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. నాణ్యతాప్రమాణాలను పాటిస్తూ రోడ్లను నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్లను కోరారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్నామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వార్డులో నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై

విచారణ చేపట్టాలి

హిమాయత్‌నగర్: నిర్మల్ జిల్లాలోని బాసర ట్రిపుల్ ఐటీలో చోటు చేసుకుంటున్న విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మంగళవారం ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సాంకేతిక విద్య అందించే విశ్వ విద్యాలయంలోని బాసర ట్రిపుల్ ఐటీ లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని,ఇప్పటి వరకు ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, నవంబర్ 12 : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి చోటు చేసుకున్నది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిలో పెద్దషాపూర్ వద్ద షాద్‌నగర్ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై పడి గాయాలైనట్లు సమాచారం రావడంతో వెంటనే ఘటనా స్థానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించి ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెల